# ఎ టీచర్స్ డే

విశ్వనాథం స్టేషన్‌కి వచ్చేసరికి రైలు బయల్దేరటానికి సిద్ధంగా ఉంది. అయినా అతను నింపాదిగానే కదిలాడు. గార్డు ఆకుపచ్చ జెండా ఊపకపోవడం గమనించి. అతను ఎక్కవలసిన పెట్టే ఎదురుగా. గుర్తుపట్టేందుకు వీలుగా అతని గుమస్తా నిలబడి ఉన్నాడు. దాని వల్ల విశ్వనాథం సులువుగానే పెట్టెను గుర్తుపట్టి ఎక్కేసాడు. అతని వెనకాలే గుమాస్తా ఎక్కాడు కిటికీ పక్కనున్న ఓ సీటు కింద అతని బుట్ట, సీట్లో అతని తువ్వాలు, పైన సామాన్ల అరలో అతని పెట్టె, అంతకు ముందే పెట్టి వాటికి కాపలా నిలబడ్డ బంట్రోతు అయ్యగార్ని చూడగానే పక్కకి తప్పుకొన్నాడు. విశ్వనాథం సుఖాసీనుడయ్యాక గుమస్తాకి, బంట్రోతుకి అనుమతిచ్చి వెళ్ళిపొమ్మన్నాడు. కాని వాళ్లు రైలు దిగి అది కదిలేవరకు ఆగి ఆయనకు తుది నమస్కారాలు పెట్టి సెలవు తీసుకొన్నారు.

అప్పుడాయన ఆఫీసు నుంచి తెచ్చుకున్న వార్తాపత్రిక తెరిచాడు. మొదటి పేజీలో ప్రముఖంగానే సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి బొమ్మవేసుంది. సెప్టెంబర్ అయిదు ఆయన పుట్టినరోజు అన్న విషయం పత్రిక చదువరులకి గుర్తుచేసి, ఆ రోజు దేశవ్యాప్తంగా "టీచర్స్ డే" గా పరిగణించి, టీచర్స్‌ని గౌరవించే సాంప్రదాయం గురించి ఓ కాలమ్ వ్రాసింది.

విశ్వనాథం నవ్వుకున్నాడు. 'గురువుల దినం' అనుకొన్నాడు మనసులో. "ఎవ్రీడాగ్‌హాస్ ఇట్స్‌డే" అని మరోసారి నవ్వుకొన్నాడు. అతను విద్యార్థిగా ఉన్నప్పుడు గురువుల్ని అల్లరి పెట్టాడు కాని గౌరవించలేదు. అయిన చదువూ అబ్బింది. ఉద్యోగమూ వచ్చింది. అతనికి చదువు చెప్పిన బడిపంతుళ్లు బడిపంతుళ్ళుగానే బతుకుఈడుస్తుంటే విశ్వనాథం చెకచెకా మెట్లెక్కి పెద్ద ఆఫీసరై పోయాడు. పిల్లల్ని ఖరీదైన స్కూళ్ళల్లో చేర్చాడు. అందుకని వాళ్ళను గురించి శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం లేదు అతనికి.

ఇన్నాళ్ళకీ వార్తాపత్రిక పుణ్యమా అని అతని మనస్సు మేడలోకి మేస్టర్లు గేట్ క్రాష్ చేసి అడుగు పెట్టారు. "గేట్ క్రాష్ చేసిన వాళ్ల మీదకి వేటకుక్కల్ని ఉసికొల్పాలి" అనుకొన్నాడు. అనుకొని నవ్వుకున్నాడు. వేటకుక్కల్ని తలుచుకొన్నప్పుడల్లా ఈ మధ్య అతనికెందుకో రామారావు గుర్తుకు వస్తున్నాడు, లేక రామారావు గుర్తుకు వచ్చినప్పుడల్లా

వేటకుక్కలు గుర్తుకు వస్తున్నాయి. ఇప్పుడు రామారావు పనిమీదే తనీ ప్రయాణం చేస్తున్నాడు.

రామారావు లో తనువృద్ధిలోకి వచ్చేకురాడ్ని వాసన పట్టాడో లేక రామారావే తన కూతుర్లో అభివృద్ధికి వెళ్ళే దార్ని వాసన పట్టాడో కాని వాళ్ళిద్దరు పెళ్లాడనున్నారు. రామారావు తన కింద పనిచేస్తున్నాడు. కనక తన చెప్పుచేతల్లో ఉంచుకోవచ్చన్న ఆలోచన తనది. అది దురాలోచనా? కాదు. దూరాలోచన, అయితే ఈ పెళ్ళికి వచ్చిన ఇబ్బందల్లా రామారావు తల్లిదండ్రులు ఓ మారుమూల పల్లెటూళ్లో ఉన్నారు. అక్కడికి వెళ్ళటానికి ఓ పగలల్లా రైల్లో ప్రయాణం చేస్తే, సాయంత్రానికి బస్సు పట్టుకోవాల్సిన ఊరు చేరవచ్చు. అక్కడ్నుంచి రెండు గంటల ప్రయాణం చేస్తే బస్సు ఆ కుగ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో దింపి పోతుంది. ఈ ప్రయాణం విశ్వనాధానికి ఇష్టం లేదు.

"ఈసారికి కాస్త కష్టపడండి అమ్మాయి తరువాత సుఖపడ్తుంది" అంది భార్య.

"ఒకసారి వెళ్ళటానికి నేను భయపడ్తుంటే అమ్మాయి పదిసార్లు ఆ అత్తవారి ఊరు ఎలా వెళ్తుంది?" అన్నాడు విశ్వనాథం.

"అదెందుకన్నిసార్లు వెళ్తుంది? అల్లుడే ఇల్లరికం ఉంటాడు ఈ ఊళ్ళో!" అని భార్య లౌక్యం బోధించింది.

అవసరమైనప్పుడు కాళ్ళు పట్టడం అవసరం లేనప్పుడు ముఖం చాటెయ్యటం తనకు ఉద్యోగంలో పెట్టిన విద్య. ఈ సారికి వెళ్ళి పిల్లాడి తల్లిదండ్రుల్ని లాంఛనప్రాయంగా ఆర్థించి గౌరవం నటిస్తే ఆపైన వాళ్ళతో తనకేంపని. తన కూతురికేంపని! పెళ్ళయ్యే వరకు కొంచెం అణిగి ఉండాలి.

అనువుకానిచోట అధికుల మనరాదు, అధికుల మనగలిగిన చోట మానరాదు. ప్రస్తుతం ప్రపంచంలో సర్దుకొనే మూడ్‌లో ఉన్నాడు. విశ్వనాథం అతను మామూలుగా ఆఫీసు పని పెట్టుకోకుండా ప్రయాణం చెయ్యడు. చుట్టాలింట్లో పెళ్ళికైనా సరే! ఆఫీసు పనైతే ఆఫీసు కారు. లేక ఎ.సి సెకెండ్ స్లీపర్‌లో కాని వెళ్తాడు బొత్తిగా ఈ ఊరి చుట్టుపట్ల ఆఫీసు పని వేసుకొనే వీల్లేకపోయింది. అలాంటి వీల్లేని ప్రదేశాలకతను, తన ప్రాణాలమీదకి వస్తేగాని వెళ్ళడు ఇప్పుడు. అతని ప్రాణం అయిన అతని కూతురు పెళ్ళి సమస్య ఈ ప్రయాణంతో ముడిపడి ఉంది కనక బయల్దేరాడు. స్వంత డబ్బుతో ప్రయాణం కనక ఉత్త సెకండు క్లాసు ఎక్కాడు. అప్పటికీ ఆఫీసు కార్లోనే స్టేషన్‌కి వచ్చాడు.

అరగంటలో పేపర్ చదివేసాడు.

"ఓ సారి పేపరిస్తారా?" అని ఎదుటి సీట్లో అతను అడిగాడు.

విశ్వనాథం అడిగినతన్ని పరీక్షించి చూసాడు. ఓ యాభై ఏళ్లుంటాయి. సెకెండ్ క్లాస్‌లో ప్రయాణం చెయ్యటం అలవాటున్నవాడిలా సీట్లో భాషింపట్టం వేసుకొని కూర్చున్నాడు.

తను పేపరు చదవటం ఎప్పుడు పూర్తి చేస్తాడా అని రాబందులా కాచుకూర్చున్నట్లున్నాడు. విశ్వనాథం ఒక లోకువ చూపు చూసి పేపరిచ్చాడు.

ఎదురి సీటతను ఆ పేపర్ని తీరుబడిగాఅక్షరం వ్యర్థం చేయకుండా ఓ గంట చదివి వెనక్కి ఇచ్చేస్తూ.

“ఏ ఊరు వెళ్తున్నారు?” అని విశ్వనాథాన్ని అడిగాడు.

విశ్వనాథం చెప్పాడు.

“తమాషాగా ఉందే! నేను అదే ఊరు వెళ్తున్నాను” అన్నాడతను.

విశ్వనాథం మొదటిసారి అతనిపట్ల కుతూహలం ప్రదర్శిస్తూ “మీ కా ఊళ్ళో కృష్ణయ్య గారని ఉన్నారు తెల్సా?” అని అడిగాడు.

“లేదండి. నన్నా ఊరు కొత్తగా బదిలీ చేసారు. చేరడానికి వెళ్తున్నాను అందుకని ఒకడ్నే వెళ్తున్నాను” అన్నాడతను.

అతనికి కృష్ణయ్య తెల్సునేమో అని తను అడిగాడుకాని, అతను ఒక్కడు వెళ్తే తనకెందుకు వందమందిని వెంట పెట్టుకొని వెళ్తే తనకెందుకు!

అయినా కొత్త ఊళ్లో ఏదైనా అవసరం రావచ్చు. అందుకని విశ్వనాథం “మీరు ఎందులో ఆఫీసరు?” అని అడిగాడు.

“నేను బడిపంతుల్నండి. మీరు చూస్తుంటే పెద్ద ఆఫీసర్‌లా ఉన్నారు. ఆ కుగ్రామంలో మీకేం పని?” అని అడిగాడా బడిపంతులు, ప్రశ్నని సమాధానికి జోడించి.

విశ్వనాథం తన తాహతుకాని వాడితో ఎందుకు మాట్లాడటం అని కట్ చేద్దామనుకున్నాడు. కాని ఓ క్షణం ఆలోచించి తన గొప్పలు వినడానికి ఓ శ్రోతగా ఈ పంతులు పనికివస్తాడని అంచనావేసి తను వెళ్తున్న పని చెప్పాడు. ఎప్పుడు కార్లలో తిరిగే తనకి ఆ ప్రయాణం ఎంత ఇబ్బందిగా ఉందో చెప్పాడు. తన ఆఫీసులో తనకింద ఎంతమంది పనిచేస్తున్నారో చెప్పాడు. ఇల్లా చాలా చెప్పాడు. ఎదుటి సీటతను అడ్డుచెప్పకుండా విన్నాడు.

సాయంత్రం నాలుగు గంటలకి రైలు ఓ మోస్తరు స్టేషన్‌లో ఆగింది. విశ్వనాథం కిటికీలోంచి తల బయటకు పెట్టి చూస్తుంటే అతని కింద పనిచేసి రిటైరైన గుమాస్తా ఒకడు ప్లాట్‌ఫామ్ మీద కనిపించాడు. విశ్వనాథం “సుబ్బారావు” అని పిలిచాడు.

సుబ్బారావు తిరిగి చూసి విశ్వనాథాన్ని పోల్చుకున్నాడు. దూరంనుంచే ‘బావున్నారా?’ అంటూ సౌంజ్ఞలతో అడిగాడు ‘వస్తాను’ అంటూ సౌంజ్ఞ చేసి, చేతిలో సంచీతో మరో పెట్టివైపు వెళ్ళిపోయాడు.

"హార్నీ!" అనుకొన్నాడు విశ్వనాథం. సుబ్బారావు దగ్గరికి వచ్చి పలకరిస్తాడని విశ్వనాథం ఆశించాడు. ఈ సుబ్బారావు తనదగ్గరుద్యోగం చేస్తున్న రోజుల్లో ఎంత వినయంగా తనతో మాట్లాడడమే అదృష్టం అన్నట్టు ప్రవర్తించేవాడు.

"ఆయనెవరో మీకు పరిచయస్తుడుకాబోలు" అన్నాడు అది గమనించిన బడిపంతులు,

"మరే నా దగ్గర పనిచేసేవాడు. తొందర్లో ఉన్నట్టున్నాడు. లేకపోతే చాలాసేపు యోగక్షేమాలు అడిగేవాడు" అని విశ్వనాథం కొద్దిగా ఇబ్బందిగా సంజాయిషీ ఇచ్చుకొన్నాడు.

ఇంతలో ఒక పెద్దాయన తన బారీ దేహంతో విశ్వనాథం కూర్చున్న చోటకి వచ్చి, "విశ్వనాథం! వాటె సర్‌ప్రైజ్" అన్నాడు.

విశ్వనాథం ఆయన్ని చూసి నిజంగా సర్‌ప్రైజ్ అయ్యాడు. వచ్చినాయన తనకి పదేళ్ళక్రితం బాస్. ఆయనింకా నిలబడే ఉన్నాడు.

విశ్వనాథం లేవకుండానే "శివరావు గారా! వాట్ఎ సర్‌ప్రైజ్" అని ఓ చిర్నవ్వు పారేసాడు. పూర్తి నవ్వు నవ్వితే కిటికీ పక్కని సింగిల్ సీటోలోంచి లేచి ఆయనకి సీటివ్వాల్సి వచ్చే పరిస్థితికి దారి తీస్తుందేమోనన్న జాగ్రత్తతో

శివరావు ఓ క్షణం ఇటూ అటూ చూస్తూ నిలబడిపోయాడు. "అల్లా కూర్చోండి" అంటూ పక్కనున్న బల్లమీద ఇద్దరు ప్రయాణీకుల మధ్యగల సీటు చూపించాడు విశ్వనాథం.

శివరావుకి బోలెడు మాట్లాడాలని ఉన్నా విశ్వనాథం ముక్తసరి సమాధానాలతో సందివ్వలేదు.

ఈ శివరావు అధికారంలో ఉన్నప్పుడు తనమీద ఎంత అధికారం చూపించేవాడు! అప్పుడు తను తప్పనిసరై గౌరవించేవాడు. ఇప్పుడు తనకేం ఖర్మ! ఇప్పుడు ఉద్యోగంలో, అధికారంలో ఉన్నది తను. శివరావు ముసలి రిటైరైన సింహం. తనకాయన్తో పనిలేదు' అనుకున్నాడు విశ్వనాథం.

అందువల్ల వాళ్ళిద్దరి మధ్య అట్టే సంభాషణ జరగలేదు. స్టేషన్లోంచి రైలూ కదల్లేదు.

విశ్వనాథానికి కాఫీ తాగాలనిపించింది బుట్టలోని ఫ్లాస్కులో కాఫీ ఉంది. కాని తన ఎదురుసీటు పంతులికి ఆఫర్ చెయ్యాలో వద్దో తేల్చుకోలేక పోయాడు. ముసలి రిటైర్డ్ సింహాన్ని "ఓ కప్పు తాగుతారా?" అని తను అడగనూ అడుగుతాడు, తన ముఖంలో కాఫీ బదులు ఆముదం కనబడి ఆయన వద్దనీ అననూ అంటాడు. బడిపంతులు వద్దని అంటాడని నమ్మకం లేదు. ఇందాక పేపర్లాగా అడిగి తీసుకోగలడు కూడా!

ఈ విధంగా ఆలోచించి విశ్వనాథం ఫ్లాస్కు తియ్యలేదు.

అదే సమయంలో ఓ ఇరవై ఏళ్ళ యువకుడు కాఫీ తీసుకువచ్చి బడిపంతులుకిచ్చాడు.

"ఎందుకోయ్ సత్యనారాయణ నీకీ శ్రమ" అన్నాడు మేస్టారు.

"పాఠం చెప్పిన గురువుకి కాఫీ తేవటం కూడా శ్రమే అయితే అల్లరి మూకకి బుద్ధి గరిపి పాఠాలు నేర్పటానికి మీరు తీసుకున్న శ్రమ మాటేమిటి మేస్టారూ!" అని నవ్వుతూ అన్నాడు.

కాఫీ తాగుతూ "అనవసరంగా సీట్లోంచి లేచి నాకీ సీటిచ్చావు. మళ్ళీ నీకు సౌకర్యం అయిన సీటు దొరికిందా?" అని అడిగాడు మేస్టారు.

నేనేం పెద్ద కష్టపడిపోలేదు మేస్టారూ! మీరు పెద్దవారు కదా కాస్త సుఖంగా కూర్చుంటారని ఆ సింగిల్ సీటుచ్చాను. కాని నిలబడలేదు కదా! పక్క పొడుగు బల్ల మీదకీ మారాను. ఇంతలో మా ఫ్రెండు వచ్చి తన దగ్గర చోటుంది రమ్మన్నాడు. పైగా ఆ పెట్టి బావుందని చెప్పాడు మీరు వినకుండా, ఎంత వయస్సు వచ్చినా మేస్టర్ల ఎదురుగుండా కొన్ని పనులు చెయ్యలేము. కొన్ని కబుర్లు చెప్పకోలేము. ఇవన్నీ ఆలోచించి ఆ బావున్న పెట్లోకి మారిపోయాను. ఆపెట్టె చాలా బావుంది మేస్టారూ!" అంటూ కొంటెగా నవ్వాడు.

అతని కొంటెతనం అర్థంచేసుకొని మేస్టారు "శ్రీఘ్రమేవ...." అనబోతుంటే

"వద్దుమేస్టారు, దానికింకా బావుండాలి" అని నవ్వేసి , "వస్తాను మేస్టారూ అని వెళ్ళిపోయాడు.

విశ్వనాథానికి ఆ గురుశిష్య సంబంధం కొత్తగాను, ఆశ్చర్యంగాను ఉంది. ధైర్యంగా కాఫీ ఫ్లాస్క్ తీసి తన ఎక్స్ బాస్‌కి ఆఫర్ చేసి వద్దనిపించుకొని కాఫీ తాగుతూ

"ఎవరా కుర్రాడు మేస్టారూ?" అని కొంత గౌరవంగా అడిగాడు.

"పది సంవత్సరాల క్రితం నా క్లాసులో ఉండేవాడు ఆ క్లాసు ఆ క్రితం సంవత్సరం కూడా చదివాడు. నేను, అతను సరిగా చదువుకోవటం అతనికి, అతని కుటుంబానికి అవసరం అని చెప్తే అతనికి గురి కుదిరి చదివి బాగుపడ్డాడు. ఒకోసారి మన మాటలితర్లకి మేలు చేస్తాయి. మేలు జరిగిన వాళ్లు మనకి కృతజ్ఞులై ఉంటారు. నిజానికి మనం నిమిత్తమాత్రులం" అన్నారు మేస్టారు.

మధ్యలో మరో ట్రైన్ క్రాసింగ్ ఉండటంతో ఆలస్యమై రెండు గంటలకి కాక చీకటి పడ్తున్న వేళకి విశ్వనాథాన్ని, బడిపంతుల్ని, బస్సెక్కాల్సిన ఊరుకిచేరవేసింది. వీళ్లు రైలు దిగటమే ఆలస్యం అన్నట్టు బయలుదేరి వెళ్ళిపోయింది. దిగినవాళ్ళు నలుగురైదుగురు కూడా లేరు. అందులో స్థానికులు వెంటనే గేటు బయటకు వెళ్ళిపోయారు.

గేటు దగ్గర స్టేషన్ మాస్టరు బదులు నిలబడ్డ పోర్టరు, విశ్వనాథాన్ని చూసి వచ్చి, "కూలీ కావాలా బాబూ!" అని అడిగాడు. ఆమాట పంతుల్ని కాక కూలీ తనను అడగటం విశ్వనాథంకీ గర్వం కలిగించింది.

"కావాలి బస్సుస్టాండుకు వెళ్ళాలి. రిక్షాలో పెట్టాలీ సామాన్లు" అన్నాడు విశ్వనాథం దర్పంగా.

బడిపంతులు తన సామాన్లు తన రెండు చేతుల్లో పుచ్చుకొని కూలీ వెంట నడవడానికి సిద్ధపడ్డాడు - రిక్షాస్టాండు దాకా. "ఈయన ఈ ఊరు వెళ్లటానికి నన్ను ఫాలో అవదల్చుకొన్నాడు" అనుకున్నాడు విశ్వనాథం.

"అల్లదిగో ఆ అగుపించే సింతసెట్టే బస్సుస్టాండ్. నానే ఒట్టుకొచ్చేత్తానన్దాక" అని ఏ బస్సు కెళ్తారేటి బాబు?" అని అడిగాడు విశ్వనాథం వెళ్లాల్సిన ఊరు పేరు చెప్పాడు.

"లాట్టు బస్సెల్లిపోనాదండి. మరిప్పుడెల్లాగా? రేపు తెల్లార్జామున కాని లేదే మల్లీ బస్సు!" అని బస్సెక్కాల్సింది తనేనన్నంత బెంగ చూపించాడు కూలీ.

"మరెలా? ఊళ్ళో మంచి హోటలుందా?" అని అడిగాడు విశ్వనాథం కొద్దిగా దర్పంగా పూర్వకంటే తగ్గిన దర్పంతో.

ఎదురుగా కనిపించే పాకే ఊళ్ళోకల్లా చెప్పుకోదగ్గ హోటలని "నాడ్జింగులు" ఏవీ లేవని చెప్పాడు పోర్టరు. ఆపైన అసిస్టెంటు స్టేషన్ మాస్టరు గది పక్కగది ప్రస్తుతానికి ఖాళీగా ఉందని అందులో కొన్ని బల్లలు ఓ ఫాను ఉన్నాయని అదే వెయిటింగ్ రూమ్‌గా అప్పుడప్పుడు కొందరు ముఖ్యులకి స్టేషన్ మాస్టరిస్తూ ఉంటాడని మాట సాయం కూడా చేసాడు.

చివరి రైలు వెళ్ళిపోవటంతో అసిస్టెంటు స్టేషన్ మాస్టరు తన గదికి తాళం వేసుకొని ఇంటికి బయల్దేరాడు. అది గమనించి తొందరగా ఆయన్ని ప్రసన్నం చేసుకోమని కూలీయే ఉపదేశించాడు తారకమంత్రం. విశ్వనాథంలో మళ్లీ ధీమా చోటుచేసుకొంది.

బడిపంతులు నిలబడిపోయాడు.

తాళం వేసేసి బయల్దేర్తున్న ఎ.ఎస్.ఎమ్.కి విశ్వనాథం ఎదురు వెళ్లాడు. తనకి వచ్చిన ఇబ్బంది చెప్పుకొన్నాడు. తనెంత పెద్ద ఆఫీసరో చెప్పుకొన్నాడు. అదే కొంప ముంచింది.

"నేనేంటి చెయ్యను" అని చిన్న రైళ్ళమాస్టరు ఏ విధమైన సానుభూతి లేకుండా ముందుకు కదిలాడు.

"ఇబ్బందిలో ఉన్న ప్రయాణీకులకీ సహాయం చేయటం మీ విధి" అని దబాయించాడు విశ్వనాథం.

సరిగా అప్పుడు ఎ.ఎస్.ఎమ్‌కి మండింది.

"ఏమిటి విధులు మారైల్వేవాళ్ళకే తప్ప మరింకెవరికి ఉండవా? మొన్న మా స్నేహితుడు పనిమీద మీ ఆఫీసుకు వస్తే ఒక్కడు తిన్నగా జవాబు చెప్పలేదు. అయిదు రోజులు తిప్పుకొన్నారు. సిటిలో హోటలు ఖర్చెంతైందో తెల్సా? ముడుపు లెంతయ్యాయో తెల్సా;"

అంటూ ఎ.ఎస్.ఎమ్. తన కోపంగా వెళ్ళకక్కాడు. ముందుకు నడిచాడు.

విశ్వనాథం ఖంగుతిని అవాక్కైపోయాడు. అతనికి, తమ తమ నెలవులు తప్పితే ఎవరికైనా ఎంత అధికారం పలుకుబడిఉంటాయో అర్థమైపోయింది. తనకీ రాత్రి ఫ్లాట్‌ఫామ్ గతి తనకే గతి లేనప్పుడు ఆ బడిపంతులకీ అధోగతి తప్పదు! అయినా అతనికే బాధా ఉండదు. పెద్దగా సుఖాలకీ అలవాటు పడి ఉండడు కదా! తనదే బాధ!

అసిస్టెంట్ స్టేషన్ మాస్టరు ముందుకు నడిచి బడిపంతులు నిలబడిన చోటకి వచ్చి ఆయన్ని చూసి అనుమానంగా ఆగి, "మీరు బ్రహ్మం మేస్టారా?" అని అడిగాడు.

"అవును" అని బడిపంతులు సమాధానం చెప్పి "క్షమించాలి. వయస్సు మీద పడ్తోంది. మీరెవరో గుర్తు రావటంలేదు" అన్నాడు.

"ఎల్లా గుర్తు పట్తారు మేస్టారూ! ఎన్నివేలమందికి పాఠం చెప్పారో. పైగా ఎప్పటి మాట? ఇరవై సంవత్సరాలైంది. మీరైతే మారలేదు కాని నాకు... మీసాలు రావటం, కొద్దిగా పండిపోటం కూడా అయింది. జుట్టు పల్చన బడింది. రైల్వే ఉద్యోగాల్లో తిరుగుడు ఎక్కువ కదా! ఇంతకూ ఈ ఊరు ఏ పని మీద వచ్చారు?" అని వినయంగా అడిగాడు. తనెవరో ప్రవర చెప్పుకొన్నాక.

బ్రహ్మం మేస్టారు తనకి అయిన బదిలీ, ఆ ఊరుకి వెళ్తూ లాస్ట్ బస్సు వెళ్లిపోవటంతో ఈ ఊళ్ళో చిక్కడిపోవటం ఆ ఎఎస్సెమ్‌కి వివరించాడు.

"మా ఇంటికి వచ్చేయండి పొద్దున్నే మా పోర్టరు మిమ్మల్ని బస్సెక్కిస్తాడు" అని రైల్వేపంతులు బడిపంతుల్తో అన్నాడు.

తనతో అంత కరుకుగా మాట్లాడిన ఎఎస్సేమ్ ఓ బడిపంతుల్తో అంత వినయంగా మాట్లాడటట్లం విశ్వనాథానికి ఆశ్చర్యం కలిగించింది.

ఈ పంతులు ఖచ్చితంగా వాడితో వెళ్లిపోతాడు. తనొక్కడూ ఈ రాత్రి ఒంటరిగా స్టేషన్‌లో ఉండాలి ఎవరైనా వచ్చినా తనని నాల్గు తన్ని ఉన్నవి ఊడ్చుకువెళ్ళినా దిక్కులేదు అని విశ్వనాథం గాబరా పడ్తుంటే, బ్రహ్మం "మీ కెందుకు శ్రమ. ఇక్కడేదో గది ఖాళీగా ఉందిట అది తెరిపించండి. అందులో మేమిద్దరం ఈ రాత్రి గడిపి పొద్దున్నే వెళ్లిపోతాం" అన్నాడు.

ఎ.ఎస్.ఎమ్. విశ్వనాథం కేసి నక్కతోక తొక్కి వచ్చావు అన్నట్టు చూసి ఆ గది తెరిపించి శుభ్రపరిపించాడు.

గది బడిపంతులు కోసం తెరిచినట్టు నటించినా కొంత తన మాటలకి కూడా తప్పకుండా ఎఎసెమ్ భయపడి ఉంటారు. అన్న నిశ్చయానికి వచ్చి అతన్ని

పట్టించుకోకుండా విశ్వనాథం ఆ గదిలోకి నడిచాడు, ఫాన్ కింద రెండు బల్లలు చేర్చుకొని దానిమీద తన సామానులు పెట్టుకొన్నాడు.

ఎ ఎస్ ఎమ్ మరో రెండు బల్లలు పోర్టర్ సాయంతో తన గదిలోంచి తీసుకువచ్చి, "మేస్టారూ! మీరు వీటిమీద పడుకోండి" అని చెప్పి వీటి జోలికి వస్తే కొడ్తాను అన్నట్లు విశ్వనాథం కేసి చూసాడు.

"మేస్టారూ, మా ఇంటినుంచి భోజనం తెస్తాను. పొద్దున్న మాత్రం మీరు హోటల్లో కాఫీ తాగి బస్సెక్కండి" అని చెప్పి వెళ్లాడు.

"మీకెందుకు శ్రమ" అని బ్రహ్మం అంటుంటే – మేస్టారూ! మీరు నన్ను మీరంటూ మన్నించి మాట్లాడకండి నాకాయుః క్షీణం. నేను ఈ రోజు అన్నం తినటానికి, నా కుటుంబాన్ని పోషించుకోడానికి చదువు కారణం. ఆ చదువుని నా గురువులు నాకు నేర్పారు. అందులోమీరూ ఒకరు. మీకు నేను ఓ పూట భోజనం పెట్టగలిగితే అది శ్రమ అవదు. ఆనందకారణం అవుతుంది. ఎవరికోగాని ఆ అదృష్టం పట్టదు. మళ్ళీ వస్తాను" అని వెళ్లిపోయాడు.

అసిస్టెంట్ స్టేషన్ మాస్టరు ఆ రాత్రి తన ఇంటినుంచి అన్నం కారేజీ తనే మోసుకొంటూ వచ్చాడు. అందులో ఇద్దరికి సరిపడే భోజనం ఉంది.

బ్రహ్మం తనతోపాటు విశ్వనాథాన్ని భోం చెయ్యమన్నాడు. ఎంతో బతిమాలగా విశ్వనాథం భోజనానికి కూర్చున్నాడు. కాని ఈ రైల్వే ఆఫీషియల్ బొత్తిగా తన్ని ఇగ్నోర్ చేసి ఆ బడిపంతుల్ని అందలం ఎక్కించటం కొద్దిగా కష్టంగాను, ఎక్కువగా ఆశ్చర్యంగాను ఉంది విశ్వనాథానికి.

బ్రహ్మం భోంచేస్తున్నంత సేపూ, "మేస్టారూ!" అంటూ అతను చదువుకొనే రోజుల్లో ఉన్న మేస్టర్ల గురించి, విద్యార్థుల గురించి కబుర్లు చెప్పాడు ఎ.ఎస్.ఎమ్.

ఆ రాత్రి సెలవు తీసుకొంటూ "ఈ, రోజు 'టీచర్స్ డే"ట. మా గుంటడు చెప్పాడు. నేను మీకు భోజనం తీసుకువెళ్లటం వాడికి చాలా నచ్చింది. తమాషాగా లేదూ మేస్టారూ! ఈ రోజున నేనభిమానించే నా టీచర్‌కి ఉడతాభక్తిగా ఏదైనా చెయ్యగలగటం. ఇది నా అదృష్టం" అన్నాడు.

బ్రహ్మం కళ్లు చెమర్చడం విశ్వనాథం గమనించాడు. "నిజమే! ఇవాళ ఈ టీచర్స్‌డే" అనుకొని రైల్వేపంతులికి, బడిపంతులికి "థాంక్స్" చెప్పాడు.